పీడీఎఫ్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరుతున్న సిఐటియు, రైతుసంఘం నాయకులు

సమస్యలు పరిష్కరించే వారికి ఓటేద్దాం

పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసే వారిని ఎమ్మెల్సీలుగా గెలిపించాలని సిఐటియు, రైతుసంఘం నాయకులు కోరారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శనివారం నాడు జిల్లా వ్యాప్తంగా ప్రచారాలు నిర్వహించారు. అనంతపురం నగరంలోని హెచ్ఎల్సి కాలనీలో వద్ద ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాల్లో నాయకులు ప్రచారం చేపట్టారు. పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల మీద ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని శాసనమండలికి ఎన్నుకోవాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారిని, దౌర్జన్యాలు, అక్రమాలు, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే వారికి ఓటు వేస్తే ప్రజాస్వామ్యానికి నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ఉద్యోగులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర సహాయ కార్యదర్శి రామిరెడ్డి, సిఐటియు నాయకులు ప్రకాష్, శీన, రాజు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి వలీ, గఫూర్, ఇస్మాయిల్ మోహన్, షరీఫ్, కిష్ట, నారాయణస్వామి పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతు : ఐద్వా

పరిశ్చమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు ఐద్వా నాయకులు మద్దతు తెలిపారు. ఈ మేరకు పిడిఎఫ్ మద్దతు పోస్టర్లను శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వారిని గెలిపించి శాసన మండలికి పంపాలన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు లక్ష్మిదేవి, కృష్ణవేణి, నాగమ్మ, ఝాన్సీ, మునిబీ, లత, రేణుక పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై తొడగొట్టి మీసం మెలేస్తున్న సిఐ మధు

అట్టుడికిన కదిరి

- వివాదంగా మారిన షాపుల తొలగింపు
- ఘర్షణకు ఆజ్యం పోసిన సిఐ వాఖ్యలు
- మీసం మెలేసి... తొడగొట్టిన సిఐ
- 'కందికుంట' నిరసన
- టిడిపి, వైసిపి ఘర్షణగా మారిన వైనం

కదిరి పట్టణం నిరసనలతో అట్టుడికింది. ఖాద్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయం వద్ద షాపుల తొలగింపు అంశంలో మొదలైన ఘర్షణ చిలిచిలికి గాలివానలా మారింది. సిఐ కౌన్సిలర్ మధ్య మొదలైన ఘర్షణ రాత్రికి టిడిపి, వైసి మధ్య ఘర్షణగా మారింది. ఏకంగా కదిరి సిఐ మధు మీసం మెలసి తొడగొట్టి ఛాలెంజ్ చేసే వరకు వెళ్లింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ వివాదంతో ఎప్పడు ఏమి జరిగుతుందో అన్న టెన్షన్ ప్రజల్లో నెలకొంది.

ప్రజాశక్తి-కదిరి టౌన్

లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం వీధిలో దుకాణాలను తొలగించే నిమిత్తం శనివారం ఉదయం సిఐ తుమ్మశెట్టి మధు, ఆ వార్డు టిడిపి కౌన్సిలర్ సుధారాణి మధ్య చిన్నపాటి ఘర్షణ మొదలైంది. సిఐ కౌన్సిలర్‌ను అసభ్య పదజాలంతో దూషించడంతో వివాదం అధికం అయ్యింది. దీనికి తోడు సిఐ టిడిపి నాయకలపై మీసం మేలేయడం.. తొడగొట్టి మరింతగా రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడమే కాకుండా మహిళలు అని చూడకుండా బూతుపురాణం అందుకోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. దీనికి అధికార వైసిపి నాయకులు మరింత మద్దతు తెలపడమే కాకుండా ఆయన్ను భూజలపైకి ఎత్తుకుని ఊరేగించారు. అటు టిడిపి, ఇటు వైసిపి రెండు పార్టీలకు చెందిన వారు నిరసనలు చేపట్టడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. శనివారం రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

షాపుల తొలగింపుతో మొదలైన వివాదం..

కదిరి పట్టణంలోనున్న ప్రముఖ దేవాలయం లక్ష్మినరసింహ స్వామి ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఆ వీధిలో రేకులషెడ్డులతో వేసుకున్న దుకాణాలున్నాయి. వీటిని తొలగించేందుకు పోలీసులు శనివారం ఆ ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడి టిడిపి కౌన్సిలరుగానున్న సుధారాణి పోలీసులను వారించారు. దుకాణాలు తొలగించవద్దని కోరారు. కాని సిఐ తుమ్మిశెట్టి మధు ఆమెపై బూతుపురాణం అందుకున్నారు. ఈ విషయం తెలిసి మరికొంత మంది మహిళలు అక్కడికి చేరుకోవడం పోలీసులు, టిడిపి నాయకుల మధ్య వివాదం మొదలైంది. అనంతరం పోలీసు స్టేషన్ ఎదుట మహిళలను దుర్భాషలాడిన సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి మహిళా నాయకులు ధర్నాకు దిగారు. ఆ సమయంలోనూ మరోమారు సిఐ మధు రెచ్చిపోయారు. నిరసన తెలుపుతున్న మహిళలపై లాఠీఛార్జి చేశారు.

సిఐ మధు నివాసం వద్ద నిరసన తెలుపుతున్న కందికుంట వెంకటప్రసాద్, టిడిపి నాయకులు

కందికుంట ఆందోళన

సిఐ మహిళల పట్ల అనుచితంగా ప్రవరించి వారిని ఇష్టానురీతిగా బూతులు తిట్టిన విషయం తెలుసుకున్న కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలోని సిఐ నివాసం వద్ద ఆందోళనకు దిగారు. ఆయన వెంట పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు వచ్చారు. ఈ సమయంలో కందికుంటపై కూడా సిఐ మధు అదే రకంగా వ్యవహరించారు. మీసాలు మేలేసి, తొడగొట్టారు. ఈ వివాదం నడుస్తున్న క్రమంలో వైసిపి నాయకులు అక్కడికి చేరుకుని సిఐకి మద్దతుగా నిరసన చేపట్టారు. ఆయన్ను భూజాలపై ఎత్తుకుని ఉరేగించారు. అటు టిడిపి, ఇటు వైసిపి ఇద్దరూ ఒకేసారి నిరసనలకు దిగడంతో పరిస్థితి చేదాటిపోయే వరకు వెళ్లింది. రెండు గ్రూపులు పరస్పరం రాళ్ళ, చెప్పులు విసురుకున్నారు. ఈ ఘటనలో రెండువైపుల వారికి స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో నల్లమాడ సిఐ అక్కడికి చేరుకుని రెండు గ్రూపులకు నచ్చజెప్పి పిరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

రహదారిపై టిడిపి శ్రేణుల నిరసన

టిడిపి శ్రేణులు కందికుంట ఆధ్వర్యంలో సిఐ తీరు నిరసిస్తూ కదిరి- అనంతపురం చెన్నై రహదారిపై సిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఇక్కడికి కూడా సిఐ, వైసిపి శ్రేణులు మరోమారు అక్కడికి చేరుకున్నారు. దీంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. వైసిపి శ్రేణులు మరోమారు సిఐని భుజాల మీద ఎక్కించుకుని, మీసం మేలేశారు. 'తేల్చుకుందాం రా'.. అంటూ టిడిపి శ్రేణులకు సవాల్ విసిరారు. ఇదే సమయంలో టిడిపి, వైసిపి శ్రేణులు ఒకరిపై ఒకరు విసురుకున్నారు. వెంటనే పోలీసులు లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. మరోమారు నల్లమాడ సిఐ నిరంజన్ రెడ్డి కందికుంటకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపారు.

పోలీసు స్టేషన్‌లో కందికుంట

రహదారిపై ఆందోళన చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. రాత్రి 11 గంటల వరకు స్టేషన్‌లోనే ఉంచుకున్నారు. ఈ సమయంలోనూ స్టేషన్ బయట టిడిపి శ్రేణులు ఆందోళన నిర్వహించారు.

ఘర్షణలో గాయపడిన టిడిపి కార్యకర్తలు

ఆదర్శ జర్నలిస్టు తిమ్మారెడ్డి

జాతీయ మీడియా సలహాదారు దేవలపల్లి అమర్

ప్రజాశక్తి రాయదుర్గం విలేకరిని సత్కరిస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జర్నలిజంలో ఆదర్శ జర్నలిస్టుగా రాకెట్ల తిమ్మారెడ్డి నిలిచారని, ప్రస్తుత జర్నలిస్టులు అందరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ మీడియా సలహాదారు దేవలపల్లి అమర్ పేర్కొన్నారు. రాకెట్ల తిమ్మారెడ్డి 23వ వర్ధంతి సందర్భంగా 'జర్నలిజం నాడు- నేడు' అనే అంశంపై అనంతపురం జర్నలిస్టుల ఆధ్వర్యంలో శనివారం నాడు అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో సీనియర్ జర్నలిస్ట్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమర్‌తో పాటు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు కష్ణప్ప, జెడ్పీ ఛైర్మన్ బోయగిరిజమ్మ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, వైఎస్ఆర్‌సిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న హాజరయ్యారు. తొలుత తిమ్మారెడ్డి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేవులపల్లి అమర్, విశ్వేశ్వరరెడ్డి తదితరులు మాట్లాడుతూ తిమ్మారెడ్డి నిత్యం సమాజంలో దోపిడీకి గురవుతున్న ప్రజల గురించి, సాగునీటి ప్రాజెక్టులు, రైతు, కార్మికుల సమస్యలపై ఎన్నో వార్తా కథనాలను రాసి ప్రభుత్వాలలో కదలికను తీసుకొచ్చారన్నారు. అనంతపురం జర్నలిజంలో ఆయన చేసిన సేవలు మరవలేనివని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు సూర్యానారాయణ, సీనియర్ జర్నలిస్టులు తలారి రామాంజనేయులు, ఆజాద్, నాగరాజు, మల్లికార్జున మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో జర్నలిస్టు తిమ్మారెడ్డి అనేకమంది జర్నలిస్టులను తయారు చేయగలిగాడన్నారు. కమ్యూనిస్టు పార్టీ కుటుంబంలో జన్మించి వామపక్ష విద్యార్థి సంఘంలో పని చేసి నిత్యం పేద ప్రజల కోసం వారి హక్కుల కోసం తిమ్మారెడ్డి పని చేశారని కొనియాడారు. అనంతరం అనంతపురం జిల్లాలో తిమ్మారెడ్డి సమకాలికులుగా పని చేసిన 40 మంది జర్నలిస్టులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు భోగేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి, రామాంజనేయులు, సూర్యనారాయణరెడ్డి, జిల్లాకు చెందిన పాత్రికయులు పాల్గొన్నారు.

జర్మనీలో పరిశ్రమల ఆధారిత సిలబస్

జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

జర్మనీ లాంటి దేశాలలో సాంకేతిక విద్యార్థులకు 80 శాతం పరిశ్రమ ఆధారిత సిలబస్ ఉంటుదని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. శనివారం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో ఇండియాస్ ఇండి జీనియస్ వేగా ప్రాసెసర్స్ అండ్ ఈకో సిస్టమ్ వర్క్ షాపు డాక్టర్ మాధవి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి జేఎన్టీయూ ఉపకులపతి రంగజనార్ధన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారభించారు. అనంతరం ఉపకులపతి మాట్లాడుతూ జర్మనీ దేశాలలో యూనివర్సిటీ సిలబస్ 70 శాతం నుంచి 80 శాతం పరిశ్రమలు ఆధారంగా ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక కొత్త ప్రాడక్ట్‌ను కనుగొనడానికి ప్రయత్నిస్తారన్నారు. మన యూనివర్సిటీ సిలబస్‌లో కూడా పలు మార్పులు చేపట్టామని తెలిపారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు, ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులకు ప్రవేశ పెట్టామన్నారు. విద్యార్థులు సబ్జెక్టులను ఆన్‌లైన్‌లో చదివే విధంగా ప్రవేశపెట్టామని చెప్పారు. ఇటువంటి వర్క్ షాపుల వల్ల విద్యార్థులు బేసిక్స్ నేర్చుకోవచ్చునని తెలిపారు. విద్యార్థులు లేటెస్ట్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చి వాటిని ప్రపంచానికి తెలియజేసే విధంగా విద్యార్థులు రావాలని పిలుపునిచ్చారు. సెమీ కండెక్టర్స్ వల్ల ఇండస్ట్రికి ప్రస్తుతం చాలా ప్రాధాన్యత ఉందని తెలిపారు. ది సెంటర్ ఫర్ డెవలప్ మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ తిరువనంతపురం సంస్థ వారు తాయారు చేసిన ఈ ప్రాసర్ గురించి సాంకేతిక విద్యా సంబంధమైన ఈ వర్క్ షాపును 1979-83 బ్యాచ్ పూర్వ విద్యార్థులతో కలిసి ముందుకు తీసుకొచ్చారన్నారు. ఈ వర్క్ షాపులో అన్ని విభాగాల నుంచి 10 మంది ఇంజినీరింగ్ బోధకులు, 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వర్క్ షాపులో పాల్గొన్న వారికీ సర్టిఫికెట్ల రూపంలో గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుజాత, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.భవాని, బోధన, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

మేనేజ్‌మెంట్ విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

మేనేజ్మెంట్ విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోవాలని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. శనివారం జేఎన్టీయూ ఎంబిఎ విభాగం నందు మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన హాజరయ్యారు. ఎంబిఎ విద్యార్థులు మేనేజ్ మెంట్ స్కిల్స్‌తో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుంటే భవిష్యత్ అద్భుతంగా ఉంటుందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు పండమెంటల్స్ మీద అవగాహన కూడా పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమములో వర్శిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య కేశవరెడ్డి, స్పోర్ట్స్, డైరెక్టర్ బి.జోజిరెడ్డి, పీఆర్‌వో రామశేఖరరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓటీపీఆర్ఐలో వార్షికోత్సవ సంబరం

- ఫార్మాసీ విద్యార్థులకు ప్రపంచ స్థాయిలో ఉపాధి అవకాశాలు
- జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు అనుబంధ సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం సంబరంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన, వర్శిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ ఇ.కేశవరెడ్డి, యువ సినీనటులు నీలారమణ, గాయత్రి రమణ, ప్రముఖ జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులు శ్రీకాంత్ రెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుఊ ఓటీపీఆర్ఐ దక్షిణ భారతదేశంలో పేరు ప్రఖ్యాతులు సాధించిన సంస్థ అన్నారు. ఫార్మాసీ, ఫుడ్ టెక్నాలజీ విద్యను అభ్యసిస్తున్న వారంతా అకుంఠిత దీక్షతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఫార్మసీ విద్యార్థులకు ప్రపంచ స్థాయిలో అపార అవకాశాలు ఉన్నాయని, అందుకు అనుగుణంగా సబ్జెక్టులపై ప్రావీణ్యం పెంచుకోవాలని సూచించారు. అనంతరం గత వారం రోజులుగా వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం సినీ నటీమనులు నీలిమా రమణా, గాయత్రి రమణలు విద్యార్థులతో కలిసి నృత్యాలు చశారు. ఈ కార్యక్రమంలో ఓటీపీఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ గోపీనాథ్ బోధనా,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

యువ సినీతారలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న ఓటీపీఆర్ఐ విద్యార్థినులు

బకాయి వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి

నార్పల : మూడు నెలలుగా జీతాలు పడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని..కుటుంబ పోషణ భారమయిందని.. వెంటనే వేతనాలు చెల్లించండి మహాప్రభో..అంటూ వెలుగు సిబ్బంది వాపోతున్నారు. కోట్లాది రూపాయలు తమ చేతుల మీదుగా మహిళా సంఘాలకు పంపిణీ చేస్తున్నామని, తమకు మాత్రం జీతాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమ విధుల గురించి మాట్లాడుతున్నారే తప్ప.. బకాయి వేతనాల గురించి మచ్చుకైనా పట్టించుకోవడంలేదని తమ బాధను వెల్లగక్కుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని వెలుగు సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

19వ వార్డులో కాలువ మరమ్మతులు

ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలోని 19వ వార్డులో వెంకటేశ్వర సినిమా థియేటర్ వెనుక డ్రెయినేజీ కాలువకు వైసిపి నాయకులు శనివారం మరుమ్మతులు చేపట్టారు. వార్డు ప్రజలతో పాటు విద్యార్థులు అరబిక్ హైస్కూల్, మసీదుకు వెళ్లడానికి ఇబ్బందులు పడేవారు. వార్డు ప్రజల సూచనల మేరకు కాలువలో చెత్తాచెదారాన్ని తొలగించి మరుమ్మతులు చేపట్టారు.

పింఛన్ల పంపిణీపై వైసిపి పెత్తనమేంటి.?

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ పింఛన్ల పంపిణీలో వైసిపి కార్యకర్తల పెత్తనమేమిటని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ప్రశ్నించారు. శనివారం రాయదుర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మార్చి ఒకటో తేదీ నుండి సామాజిక పింఛన్లను వైసిపి కార్యకర్తల కనుసన్నల్లో పంపిణీ చేయాలని జగన్‌రెడ్డి ఒక దుష్ట ప్రణాళిక రూపొందించారన్నారు. ప్రతి నెలా జరిగే పింఛన్ల పంపిణీలో వైసిపి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తప్పనిసరిగా పాల్గొనడంతో పాటు లబ్ధిదారులతో ఫొటోలు దిగి వాటిని ఆ పార్టీ సోషల్ మీడియా గ్రూపుల్లో విధిగా పెట్టాలని ఇటీవల వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి వర్తమానం పంపారన్నారు. సదరు సర్కులర్‌ను ప్రదర్శిస్తూ, ఇది పూర్తిగా అధికార దుర్వినియోగమే అవుతుందని విమర్శించారు. ప్రజల డబ్బు వారికి పంపిణీ చేసేటప్పుడు పార్టీ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల పెత్తనం ఏంటని ప్రభుత్వాన్ని నిలదీశారు. వైసీపీపై ప్రజల్లో పూర్తిగా వ్యతిరేకత ఉండటంవల్లే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులను అడ్డుపెట్టుకొని మమ అనిపించారన్నారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పార్టీ పేరుతో నేరుగా ప్రజల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారన్నారు. అసమర్థునికి, పనికిమాలినోడికి అధికారం ఇస్తే ప్రభుత్వాన్ని ఏ రకంగా భ్రష్టు పట్టిస్తాడో జగన్మోహన్ రెడ్డి రూపంలో కళ్లారా చూస్తున్నామని దుయ్యబట్టారు. వైసిపి కార్యకర్తలు ప్రభుత్వ కార్యక్రమాలపై పెత్తనాలు చేసే విధంగా వ్యవహారాలు నడుపుతోన్న జగన్మోహన్ రెడ్డి దుర్నీతిని ఎండగట్టడానికి గవర్నర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ధనంపై పార్టీకి పెత్తనం ఇవ్వడంపై రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పింఛన్ల పంపిణీలో పార్టీ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పెత్తనం చేస్తే టిడిపి తరపున అడ్డుకుంటామని కాలవ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి ఇనాయత్, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు జమీల్ ఖాన్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, తిప్పేస్వామి, మారెప్ప, సిద్దన్న, అంజి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బస్సు షెల్టర్ ప్రారంభం

బెలుగుప్ప : మద్దూరు సువర్ణమ్మ, మద్దూరు స్వామి జ్ఞాపకార్థం వారి కుమారులు వివేకానంద, రవీంద్ర, శ్రీనివాసులు రూ.60 వేలతో బెలుగుప్ప మండలం ఎర్రగుడి గ్రామ సమీపంలో నిర్మించిన బస్సు షెల్టర్‌ను శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ రామకృష్ణయ్య హాజరై బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెలుగుప్ప నుండి ఎర్రగుడి, ఆవులెన్న, వెంకటాద్రిపల్లి గ్రామాలకు వెళ్లాలంటే బస్సు కోసం ప్రయాణికులు రోడ్డుపక్కన ఎండలో వేచిచూస్తూ ఇబ్బందులు పడేవారన్నారు. శ్రీనివాస క్లాత్ స్టోర్ మద్దూరు స్వామి కుమారులు బస్సు షెల్టర్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. శ్రీనివాస విద్యా నికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, ధనుంజయ, కొండారెడ్డి, ఎర్రిస్వామి, శివన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుమ్మనూరు త్రివేణికి నివాళి

ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తమ్ముడు, ఆలూరు వైసిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి సతీమణి గుమ్మనూరు త్రివేణి పార్థివదేహానికి ఎమ్మెల్సీ వై.శివరాంరెడ్డి శనివారం నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో విడపనకల్ మండలం వైసీపీ నాయకులు కరణం భీమిరెడ్డి, మేకల పంపాపతి, ఎన్.తిమ్మాపురం ఉప సర్పంచి రాము, గడేకల్ వైసీపీ నాయకులు గొల్ల ఎర్రిస్వామి, భీమలింగప్ప, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని మడుగుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీవో యోగానందరెడ్డి శనివారం పరిశీలించారు. ముందుగా మస్టర్లను వెరిఫికేషన్ చేశారు. కూలి డబ్బులు సక్రమంగా పడుతున్నాయా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా..అని ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మడుగుపల్లెలోని అంగన్‌వాడీ సెంటరును పరిశీలించారు. పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

వ్యాక్సినేషన్ కేంద్రం తనిఖీ

పెద్దపప్పూరు : మండల పరిధిలోని ఎం.వరదయపల్లి గ్రామంలోని వ్యాక్సినేషన్ కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి శనివారం తనిఖీ చేశారు. ఎంసిపి కార్డులు, ఆర్‌సిహెచ్ రిజిస్టర్ పరిశీలించారు. విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, ఎప్పటికప్పుడు జ్వరాలపైన ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉండాలని సిబ్బందికి సూచించారు.

మహారాజశ్రీ గుత్తి ఆరవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

O.S.No.3/2022

Between:

గొల్ల లలిత మరియు ఇతరులు ...వాదులు

మరియు

సి.జయలక్ష్మి (మరణించినది) మరియు ఇతరులు ...ప్రతివాదులు

To,

D4: సి.వరలక్ష్మి W/o రామచంద్ర (ఆర్‌పిఎఫ్), D/o లేట్ చిన్న నారాయణ, జమ్మిచెట్టు వెనుక, సూరసింగనపల్లి, గుత్తి - ఆర్.ఎస్

నాలుగవ ప్రతివాదికి సమ్మన్

పై దావాను వాదులు దావా ఆస్తులలో తమ భాగమును కోరుతూ విభాగాలకు గాను పై కోర్టు నందు దాఖలు చేసియున్నారు. పై దావా మీ యొక్క హాజరు కొరకు వాయిదా 13-03-2023వ తేదీన వేయబడినది. పై దావా నందు మీకేమైనా ఆక్షేపణలున్న యెడల పైన తెలిపిన వాయిదా రోజున పై కోర్టు నందు ఉ॥10.30 గం॥లకు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవచ్చును. లేనియెడల పై దావాను మీ పరోక్షములో తీర్మానింపబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:13-03-2023.

జి.లక్ష్మీపతి
అడ్వకేట్, గుంతకల్లు.

In the Court of the Principle District Judge: Anantapuramu

G.W.O.P.No.20/2023

Between:

వంకం ధనలక్ష్మి W/o Late పి.శ్రీధర్, వయస్సు:42 సం॥, Hindu Employee, Residence ప్రస్తుతం West Colony Railwheel Factory No.328/B, Bangalore North, Yalahanka, Bangalore-560064. ...వాది

మధ్య

-నిల్- ...ప్రతివాది

నోటీసు

ఇందుమూలముగా అందరికీ తెలియచేయడమేమనగా పై కేసులో అర్జీదారులైన వంకం ధనలక్ష్మి భర్త లేట్ పి.శ్రీధర్ బెంగుళూరు నివాసియైన ఆమె తమ భర్త చనిపోయినందువలన ఆయన పేరిట ఉన్న షెడ్యూలు ఆస్థిని తనమైనర్ పిల్లలైన 1.పి.శశాంక్, 17 సం॥ వయస్సు మరియు 2.పి.నిధిష్ 10 సం॥ వయస్సు వారి పోషణ మరియు రక్షణ నిమిత్తము అమ్మదలచుచున్నది. ఈ విధంగా షెడ్యూలు ఆస్తిని అర్జీదారురాలు అమ్ముటకు ఎవరికైన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టువారి యెదుట 10-03-2023 తేది ఉ॥ 10.30 గం॥లకు హాజరై ఆక్షేపణలు తెలియచేయవచ్చును.

షెడ్యూలు:

House site plot అనంతపురం జిల్లా అనంతపురం పట్టణము అనంతపురం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న క్రింది ఆస్తి వివరములు.

S.No.	A.C.	A.C.	Plot No's	A.C.
170.2	1.03 పైకి	0.54 పైకి	7 Full And 6 to Kontha Verasi	0.09.52 పైకి Middle

A.C.	H.S.No.
0.03.01	0.012

హద్దులు:East: Musala Reddy Salamma's Plot, West: S.A. Rasool Plot, South: 33 feet Road, North: Remaining Plot.

కొలతలు:Eastern Side - 50 Feet or 15.25 Mtrs.
Western Side - 50 Feet or 15.25 Mtrs.
Northern Side - 27.3 Feet or 3.32 Mtrs.
Southern Side - 25.3 Feet or 7.71 Mtrs

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వి.జె.రవికుమార్, ఎస్ఎండి జియావుద్దీన్
పిటీషనర్ తరపున న్యాయవాదులు, అనంతపురం
సెల్:9440448591, 9440693746.

పరిధులు దాటుతున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారులు తమ అధికార పరిధులను దాటి వ్యవహరించడం ఇటీవలి కాలంలో పెరుగుతోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ వారంలో జరిగిన రెండు ప్రధాన ఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎన్నికల్లో పాలక పార్టీకి మద్దతుగా ఎన్నికల నిబంధనలను సైతం లెక్క చేయకుండా చేసిన వ్యవహారం పాలక భక్తిని చాటి చెబుతోంది. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి రాజ్యాంగ స్ఫూర్తికే భిన్నంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోనే దైవ భక్తి కార్యక్రమం పేరుతో మృత్యుంజయ హోమం నిర్వహించ తలబెట్టిన విషయం విధితమే. ఈ రెండు ఘటనలూ అధికారులు తమ పరిధిలను ఏ రకంగా దాటి వ్యవహరిస్తున్నారన్నది స్పష్టం చేస్తోంది. విద్యాశాఖ ఉన్నతాధికారిగా ఉన్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి వైసిపి అభ్యర్థిగా ఉపాధ్యాయ నియోజకవర్గానికి బరిలో దిగిన రామచంద్రారెడ్డిని వెంట బెట్టుకుని ఒక అతిథి గృహంలో రాత్రి సమయంలో జరిపిన విందు వ్యవహారాన్ని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అడ్డుకున్నారు. ఆ సమయంలో ఆర్జేడీ మద్యం మత్తులో పోలీసు అధికారుల పట్ల కూడా దురుసుగా వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అధికార పార్టీకి మద్దతుగా సదరు అధికారి వ్యవహరించి ఉండకపోతే ఈ పాటికే ఆ అధికారిపై కేసులు సైతం నమోదయి ఉండేవి. కాని అధికారపార్టీకి మద్దతుగా కావడం సదరు అధికారిపై ఎలాంటి చర్యలూలేవన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. ఇక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అధికారికంగా ఒక హోమాన్ని నిర్వహించడం ఒక రకంగా దేశ వ్యాప్తంగానే చర్చనీయాంశమైంది. దీనిపై వెనక్కు తగ్గేదేలేదని ముందు బుకాయించిన అధికారులు తరువాత మాట మార్చి హోమాన్ని రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించక తప్పలేదు. పై రెండు ఘటనల్లోనూ విద్యార్థి, యుజవన సంఘాల పోరాట పాత్రయే ప్రధానం కావడం గమనార్హం. ఇక ఈ వారంలో మండలి ఎన్నికల వేడి సైతం మొదలైంది. నామినేషన్ల ఘట్టం ఒక రకంగా సజావుగానే సాగిందని చెప్పాలి. పట్టభద్రుల, ఉపాధ్యాయ, స్థానిక సంస్థలు మూడింటికి ఒకేసారి నామినేసన్ల స్వీకరణ జరిగింది. దీంతో రాజకీయంగానూ హడావుడి కొనసాగింది. అన్ని ప్రధాన పార్టీలు ఎన్నికల వైపు దృష్టి సారించాయి. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి రెండింటికీ ధీటుగా పిడిఎఫ్ అభ్యర్థులుగా పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలు బరిలోనున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల్లో ముందు నుంచి పిడిఎఫ్ అబ్యర్థులు గట్టి పోటీనే ఇస్తూ వస్తున్నారు. అంతకు మునుపు డాక్టర్ గేయానంద్ ఎమ్మెల్సీగా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందారు. గత ఎన్నికల్లో గట్టి పోటీనే ఇచ్చినప్పటికీ గేయానంద్ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఆ ఎన్నికల్లో ఉపాధ్యాయ నియోజకవర్గానికి పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో దిగిన కత్తి నరసింహారెడ్డి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులుగా పట్టభద్రుల నియోజకవర్గానికి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డిలు పోటీ చేస్తున్నారు. వారికి ఉద్యోగ, కార్మిక సంఘాలతోపాటు, ప్రజా సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. అధికార పార్టీ గెలుపుకు అవసరమైె అన్ని రకాల ఎత్తులను ఇప్పటి నుంచి మొదలు పెట్టింది. ఆర్జేడీ వ్యవహారమే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఏదో రకంగా గెలుపు సాధించేందుకు అవసరమైన అన్ని రకాల ప్రయత్నాలను ఇప్పటి నుంచి మొదలు పెట్టిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చైతన్య ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

దండన నెపంతో సిద్ధార్థ అనే విద్యార్థిని చితకబాదిన చైతన్య స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగార్జునపై క్రిమినల్ కేసు పెట్టి స్కూలును సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వెంకీ డిమాండ్ చేశారు. విద్యార్థిపై దాడిని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణంలోని ధర్మవరం గేటు వద్ద ఉన్న చైతన్య పాఠశాల ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని ధర్మవరం గేటు వద్ద ఉన్న చైతన్య స్కూల్లో 6వ తరగతి చదువుతున్న సిద్ధార్థను హెచ్ఎం నాగార్జున దండన నెపంతో గొడ్డుని బాదినట్టు బాదాడన్నారు. అంతటితో విడిచిపెట్టకుండా కాళ్లతో ఇష్టం వచ్చినట్లు తన్నాడన్నారు. విద్యార్థి కాళ్లపట్టుకున్నా హెచ్ఎం కనికరం చూపలేదన్నారు. చదువు చెప్పే ఉపాధ్యాయులా లేక రౌడీషీటర్లా ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు ప్రశ్నించగా, తమ మీద చేయిచేసుకొని దుర్భాషలాడుతూ బయటికి నెట్టారన్నారు. రౌడీలాగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడు నాగార్జునపై చర్యలు తీసుకొని స్కూల్ సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు కిషోర్, నాయకులు చందు, కుళ్లాయి తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ఆ నాయకుడిదే పెత్తనం..!

కాంట్రాక్టు తీసుకుని పైపులైనుకు మరమ్మతులు చేపట్టని వైనం

ప్రశ్నిస్తే ఏమైనా చేసుకోండంటూ దబాయింపు

తాగునీటికి కాలనీవాసుల ఇక్కట్లు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

'బుక్కరాసముద్రం మండల కేంద్రంలోని గౌరయ్య కొట్టాలలో అధికార పార్టీ నాయకుడు అంతా నాయిష్టం అన్న రీతిలో వ్యవహరిస్తున్నాడు. తాగునీటి పైపులైనుకు మరమ్మతులు చేపట్టమంటే, చేసేదే లేదు..ఏమి చేసుకుంటారో చేసుకోండి'..అంటూ దబాయిస్తున్నారని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ నల్లప్ప విలేకరుల సమావేశంలో శనివారం మాట్లాడారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని గౌరయ్య కొట్టాలలో తాగునీటి పైపులైను ఏర్పాటుకు స్థానిక ఎంపిటిసి భర్త కాంట్రాక్టు తీసుకున్నారన్నారు. నాసిరకంగా పనులు చేపట్టడంతో పైపులు ఊడి మూలనపడ్డాయని తెలిపారు. నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేసేందుకు ఆయన ముందుకు రాకపోవడంతో పంచాయతీకి భారంగా మారిందన్నారు. కాలనీవాసులకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిపై కాంట్రాక్టరును ప్రశ్నిస్తే.. మరమ్మతులు చేపట్టేదే లేదు..ఎవరితోనైనా చెప్పుకోండి.. అంటూ దబాయిస్తున్నారని పేర్కొన్నారు. మూలనపడ్డ పైపులను అధికార పార్టీ ముఖ్య నాయకుడు, ఆయన అనుచరులు రోజూ చూస్తూ పోతున్నారే తప్ప..మరమ్మతులు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే పైపులైనుకు మరమ్మతు చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో మూలనపడ్డ పైపులను పంచాయి కార్యాలయం వద్ద ఉంచి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్య ద్వారానే యువతకు బంగారు భవిత

ఉరవకొండ రూరల్ సిఐ శేఖర్

కరస్పాండెంట్ రామును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్య ద్వారానే యువతకు బంగారు భవిష్యత్తు చేకూరుతుందని ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ పేర్కొన్నారు. శనివారం ఉరవకొండలో శ్రీ సాయి కోచింగ్ సెంటర్ ఐదవ వార్షికోత్సన్ని పురస్కరించుకుని సరస్వతి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్, బిజెపి జిల్లా అధ్యక్షులు సంధి రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తేజ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ తేజేశ్వర్‌రెడ్డి, ఉరవకొండ ఎఎస్‌డబ్ల్యు ఓ రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలతో పాటు ఏపీఆర్జేసీ, పాలిటెక్నిక్ తదితర పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఉత్తమ బోధన అందిస్తున్నారని తెలిపారు. మంచి ఫలితాలు సాధించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. భవిష్యత్తులో అన్ని పోటీ పరీక్షలలో పాల్గొనే విధంగా విద్యార్థులను మానసికంగా బలోపేతం చేసి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథులతో పాటు శ్రీ సాయి కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ రాముకు శాలువా కప్పి, పూలమాలు వేసి విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి మధు ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణస్వామి, ఎమ్మెస్ఎఫ్ నాయకులు చిరంజీవి, ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బండారు కుళ్లాయప్ప, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో 'సస్య భారత్'

మొక్కలు నాటుతున్న ఎజిఎం సుబ్బారెడ్డి, విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ చైతన్య హౌసింగ్ బోర్డు రెసిడెన్షియల్ గర్ల్స్ పాఠశాలలో సస్యభారత్ పైన విహారయాత్ర ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఎజిఎం సుబ్బారెడ్డి పచ్చజెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మొక్కల పెంపకం, వాటి పరిరక్షణ, వాటివల్ల కలిగే లాభాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సందర్శించారు. వ్యవసాయ పరిశోధన బృందంతో మాట్లాడి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విలువైన సమాచారాన్ని అందించారు. వ్యవసాయ పరిశోధనల్లో భాగంగా చిరుధాన్యాలు అయిన వరి, గోధుమ, సజ్జ, జొన్న, రాగి, వేరుశనగ తదితర పంటల గురించి ప్రిన్సిపల్ డాక్టర్ బి.సహదేవరెడ్డి, సైంటిస్టులు విద్యార్థులకు వివరించారు. చిరుధాన్యాల ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమీనా ఖాన్, అకడమిక్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్

కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ స్పోర్ట్స్ మీట్‌ను ఎజిఎం సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్యార్థులు ఇంత చిన్న వయసులో చలాకీగా క్రీడల్లో పాల్గొని అతిథుల మనసులను ఆకట్టుకున్నారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబ స్సుం, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్ రిషిబాల, అప్పలనాయుడు, ఏవో గోపాల్, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీరజ, భారతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి కరుణ, పిఇటిలు సురేష్, రవితేజ, గాయత్రి పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులతో బంగారు భవిష్యత్తు

ప్రిన్సిపల్ అష్రఫ్ అలీ

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ద్వారా విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు చేకూరుతుందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ అష్రఫ్ అలీ పేర్కొన్నారు. ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య శిక్షణ కేంద్రం వారు 30 మంది విద్యార్థులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులపై ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ అష్రఫ్ అలీ, కోఆర్డినేటర్ అనిల్, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ టి.జయలక్ష్మి, శిక్షకురాలు వి.జయలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ సాఫ్ట్ స్కిల్స్, సి.భాషా ఎస్‌క్యూఎల్, ఒరాకిల్, జావా తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని వారు తెలిపారు. శిక్షణ తరగతులు తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రిబుల్ ఈ శాఖధిపతి వై.సురేష్ బాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో మనోవికాసం

డిప్యూటీ డీఈవో శంకర్ ప్రసాద్

ప్రజాశక్తి-గుత్తి

సైన్స్ ఎగ్జిబిషన్ల వల్ల విద్యార్థుల మనోవికాసం అభివృద్ధి చెంది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని జిల్లా ఉప విద్యాధికారి శంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణ శివారులోని మాసినేని ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. డిప్యూటీ డిఇఒ శంకర్ ప్రసాద్, మున్సిపల్ ఛైర్ పర్సన్ డి.వన్నూరుబి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు ఎంఇఒ రాముడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణరెడ్డి, మాసినేని ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ అమరేంద్ర, సీఈవో శ్వేత, ప్రిన్సిపల్ శామ్యూల్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, వైసీపీ నాయకుడు షఫీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోతుల నాగరాజుకు మద్దతుగా సిఐటియు ప్రచారం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పిడిఎఫ్ తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు మద్దతుగా సిఐటియు నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. ఉద్దేహాళ్, బొమ్మనహాల్, ఉంతకల్, గోవిందవాడ, బలనగుడ్డం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను, పట్టభద్రులను సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు పోతుల నాగరాజుకు వేయాలని కోరారు. గ్రామాల్లో పోస్టర్లు అతికించి ప్రచారం నిర్వహించారు. నాగరాజు బడుగు బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థి అని, ప్రజా సమస్యల పట్ల అవగాహన ఉందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జిల్లాలో వ్యక్తులను చైతన్యం చేయడంలో ముందున్నారన్నారు. ఇలాంటి వ్యక్తికి అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. వెలుగు, అంగన్‌వాడీ కార్యాలయాల్లో సిబ్బందిని, హమాలీలు, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు, వీఆర్ఏలను కలిసి ఓటును అభ్యర్థించారు.

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : రూరల్ పరిధిలోని ఆటోనగర్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్ నాగప్ప తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పెద్ద గోగులపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవరావు (43) 12 సంవత్సరాల క్రితం భార్య నుండి విడిపోయి ఒంటరి జీవితం గడుపుతూ బేకరీ షాపులో కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. తాగుడుకు అలవాటుపడ్డ చెన్నకేశవరావు ఒంటరితనాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట జూదరులు అరెస్టు

యల్లనూరు : మండలంలోని 85 నిట్టూరు, గిర్రమ్మ బావి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5895 స్వాధీనం చేసుకున్నారు.

నారాయణపురంలో వరుస చోరీలు

అనంతపురం సిటీ : అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం ఇందిరమ్మ కాలనీలో శనివారం సాయంత్రం నుంచి మూడు ఇళ్లల్లో వరస చోరీలకు పాల్పడ్డారు. కాలనీలో నివాసం ఉంటున్న వడ్డే గుర్రప్ప కుమారుడు వడ్డే సత్తి ఇంట్లో మధ్యాహ్నం 3 గంటల సమయంలో దొంగతనం జరిగింది. రెండు జతల కమ్మలు, రూ.25 వేల నగదు దోచుకెళ్లారు. సాకే చినరాయుడు ఇంట్లో రూ.55 నగదు దొంగిలించారు. నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరటి పంట అగ్నికి ఆహుతి

రూ.12 లక్షలు నష్టం

నార్పల : గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గడ్డంనాగేపల్లిలో అరటి పంట అగ్నికి ఆహుతయింది. గ్రామానికి చెందిన చిన్న నారాయణ, ఆనంద ప్రసాద్ ఆరు ఎకరాల్లో అరటి పంట సాగుచేశారు. ప్రస్తుతం పంట కాపుకొచ్చింది. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అరటి పంటకు నిప్పుపెట్టారు. దీంతో చేతికొచ్చిన అరటిపంటతో పాటు డ్రిప్ పైపులు, మోటారు వైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.12 లక్షల మేర పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు కన్నీరు మున్నీరయ్యారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

అరటి పంట దగ్ధమవడంతో పూర్తిగా నష్టపోయిన గడ్డంనాగేపల్లికి చెందిన రైతులు చిన్ననారాయణ, రాగే కుల్లాయప్ప, ఆనంద ప్రసాద్ లను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి నార్పల మండల నాయకులు ఆకుల విజయ్‌కుమ్మార్ డిమాండ్ చేశారు. శనివారం బాధిత రైతులను విజయ్‌కుమార్ పరామర్శించి ధైర్యం చెప్పారు. తెలుగు రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి తలారి తిప్పన్న, రాయవరం శ్రీరాములు, గడ్డంనాగేపల్లి బాలయ్య, పెద్ద వీరనారప్ప, యర్రగొల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఉరవకొండ : మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఉరవకొండలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కమిటీ సభ్యుడు బండారు వేమన్న, నాయకులు రవి, బ్యాళ్ల ప్రసాద్ తదితరులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయన వంద పుట్టినరోజులు చేసుకోవాలని, మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మహానంది, షంషుద్దీన్, ఓబయ్య, విశ్వనాథ్, ప్రభాకర్, అంజి పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి

గుత్తి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సాయిరాం ఆదేశించారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గుత్తి డివిజన్ పరిధిలోని మండల విద్యాధికారులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అభ్యసన పురోగతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అలసత్వం చేయకుండా నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. వినియోగించని ఉపాధ్యాయులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

గుంతకల్లు : తమిళనాడులోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అరుణాచలానికి గుంతకల్లు నుండి ప్రత్యేక బస్సు సర్వీసును మార్చి నెల 6వ తేదీన నడుపుతున్నట్లు గుంతకల్లు ఆర్టీసి డిపో మేనేజర్ నారాయణస్వామి శనివారం పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో జిల్లా నుండి అరుణాచలం పుణ్యక్షేత్రానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతకల్లు డిపో నుండి మార్చి 6వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. అరుణాచలం వెళ్లే ప్రయాణికులు శనివారం నుండి ఆన్‌లైన్‌లో లేదా ఆర్టీసి బస్టాండ్‌లోని బుకింగ్ కార్యాలయంలో కానీ టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందని తెలియజేశారు.

మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు

గుత్తి : భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సెబ్ ఎస్ఐ ఆలీ మహమ్మద్ సూచించారు. పట్టణంలోని శ్రీ సాయి జూనియర్ కళాశాలలో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవిస్తే అనారోగ్యం పాలవుతారని అన్నారు. మత్తు పదార్థాలను విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీ సాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జయరంగారెడ్డి, ప్రిన్సిపల్ కాంతారెడ్డి, డైరెక్టర్ ముత్యాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల రోజు ఫిజికల్‌టెస్ట్ వద్దు

పుట్లూరు : ఎమ్మెల్సీ ఎన్నికల రోజు రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు దేవధారుడ్య పరీక్షలు నిర్వహించడాన్ని ఉపసహరించుకోవాలని బీజేపీ ఒబిసి మోర్చా మండల అధ్యక్షుడు రాగేని రామాంజి యాదవ్ డిమాండ్ చేశారు, నిరుద్యోగుల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొనకుండా చేయడం కోసం ఎన్నికల రోజునే కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహధారుడ్య పరీక్షలను నిర్వహించేలా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. ఓటింగ్‌లో అభర్థులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు.

గ్రామంలో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు

సర్పంచి సుగాలి పద్మావతి, ఆదినారాయణ నాయక్

అనంతపురం సిటీ : అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీలోని ప్రజలు విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడకుడదనే ఉద్దేశంతో తగు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి సుగాలి పద్మావతి, ఆదినారాయణ నాయక్ తెలిపారు. శనివారం రుద్రంపేట పంచాయతీలోని వికలాంగుల కొట్టాలలో 8 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. వాటికి విద్యుత్ తీగల మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్య ఎక్కడా తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించడంతో వికలాంగుల కొట్టాలలో విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు.

ఆలూరు సాంబశివారెడ్డికి సన్మానం

శింగనమల : అనంతపురం జిల్లా వైసిపి రైతు సంఘం అధ్యక్షులుగా నూతనంగా ఎంపికైన ఎన్‌వి.నారాయణ రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫ్లవర్ బొకే అందించి శాలువతో సత్కరించారు. అనంతరం రైతు సంఘం అధ్యక్షులుగా ఎంపికైన ఆయనకు నాయకులు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. తనకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా పదవి కేటాయించడంలో సహకరించినందుకు ఆలూరు సాంబశివారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, యువనాయకులు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నాగేష్, నాయకులు చెన్నకేశవులు యాదవ్, కల్లుమడి కొండయ్య, భాస్కర్ నాయక్, సూరి తదితరులు పాల్గొన్నారు.